# వంతెన

(1989)

రైల్వే ప్లాట్‌ఫారం చాలా రద్దీగా వుంది. ఎక్కడ చూసినా జనం కిటకిటలాడుతున్నారు. ఒక ప్రక్క పోలీసు బలగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రైల్వే అధికారులు; మరోప్రక్క పత్రికా విలేకరులూ, ఆకాశవాణి' దూరదర్శన్ సిబ్బంది. ఆ మధ్యలో జనం హాహాకారాలు, ఏడ్పులూ, ఓదార్పులు.

ఆ ముందురోజు మధ్యాహ్నం రాజధానికి బయల్దేరిన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాజధాని చేరకుండానే అర్థరాత్రి ఓ వంతెన కూలి పోవడంవల్ల ప్రమాదానికి గురైంది. నాలుగైదు రైలుపెట్టెలు పూర్తిగా నదిలో కొట్టుకుపోయాయి. ఎంతోమందిని భద్రతాదళం రక్షించినా చాలామంది మరణించి వుంటారని వార్త.

ఈ ప్రమాదవార్త తెలిసిన వెంటనే ప్రయాణికుల బంధుమిత్రులు పెద్దసంఖ్యలో స్టేషన్‌కి తరలివస్తున్నారు. ఈలోగా ప్రమాదస్థలం నుండి క్షతగాత్రులను వారి వారి స్వస్థలాలకు తరలించే ప్రత్యేక రైలు వస్తున్నట్టు తెలిసింది.

అందుకనే స్టేషన్ మరింత జనసమర్ధంగా వుంది.

వినాయకరావు దిక్కుతోచని వాడిలా ప్లాట్‌ఫాంమీద అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఒక దగ్గర కూర్చోలేకపోతున్నాడు. అతని మనసంతా ఆందోళనగా వుంది.

"ఏం ప్రమాదాలు బాబూ ఏ రోజు పేపర్ చూసినా ఏదో ఒక ప్రమాదం గురించి వుండనే వుంటోంది. రైళ్ళు, విమానాలు, బస్సులు. ఓడలు. ముందుగా ఎందుకు తగిన జాగ్రత్తలు తీసుకోరో!" అంటున్నారెవరో.

"ఎందుకు తీసుకోరూ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా జరిగేవి

జరుగుతూనే వున్నాయి. అయినా కాలం ఖర్మం కల్సిరాకపోతే రోడ్డు ప్రక్కన నడిచి వెళ్తున్న వాళ్ళని కూడా ఏదో ఒక వాహనం గుద్దేసి చంపేయడం ఎన్ని చూళ్ళేదూ?"

ఎవరెవరో ఏవేవో మాట్లాడుతున్నారు. అందరి మాటలూ వింటు న్నాడు వినాయకరావు. కొందరైతే ఆశలు వదిలేసుకుని ఏడ్పులే మొదలుపెట్టారు. మరికొందరు చెప్పుకోలేని బాధతో ఆతృతతో మాటలు రానివాళ్ళలా బిత్తరచూపులు చూస్తున్నారు.

ఈలోగా మరణించిన ప్రయాణికుల వివరాలను స్టేషన్‌లో బోర్డుపై అతికించారు. ఆ బోర్డు చుట్టూ జనం. తోసుకుంటూ ఎలా గోలా వెళ్ళి బోర్డుమీది పేర్లన్నీ చదివి వచ్చాడు వినాయకరావు. అతని లోని ఆశ చావలేదు. కొందరి ప్రయాణికులనుండి తాము బతికే వున్నట్టు వచ్చిన టెలిగ్రామ్‌లందుతున్నాయి. వాటి వివరాలు వేరేచోట వుంచబడుతున్నాయి. ఎప్పటికప్పుడు వాటినీ చూసొస్తున్నాడు వినాయక రావు.

ఎంత ఆశతో ఎదురు చూస్తున్నా మనసులో అంతకు రెట్టింపు నిరాశ, దుఃఖంచోటు చేసుకుంటున్నాయి. ఎంత ధైర్యంగా నిలబడ్డా మనసు కీడును శంకిస్తూనే వుంది. అలా జరక్కుండా వుంటే బాగుం డును." భగవంతుడా నువ్వే దిక్కు. నన్ను క్షమించి రక్షించు" అని మనసులోనే కోరుకుంటున్నాడు. ఇష్టదైవాన్ని ప్రార్థిస్తున్నాడు.

అంతకుముందు రోజే కొడుకు రాజధాని నగరానికి బయల్దేరాడు. ఎన్నాళ్ళనుగానో ఎదురుచూస్తున్న ఇంటర్‌వ్యూ. ఆ ఇంటర్‌వ్యూలో గనక నెగ్గితే ఉన్నతమైన హోదా లభిస్తుంది. డబ్బుకి డబ్బు పలుకు బడికి పలుకుబడీ రెండూ కలసివస్తాయి. కలిసొచ్చే గీత వుంటే నడి చొచ్చే కొడుకు పుడతాడట. ఆ అదృష్టం కోడలదీ. పుట్టబోయే బిడ్డదీ కూడా. ఇంటర్‌వ్యూలో విజయం వరించకపోవడమన్నది ఉండనే

వుండదు.అందుకు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లూ చేసి మరీ వెళ్ళాడు. అలా కిశోర్‌కి జీవితంలో ముందు ముందుకుపోయే దారి చూపింది తానేకాదూ?

అలా దారి చూపింది ఇలా ఈ రోజు బాధపడానికేనా? అంచ లంచలుగా వచ్చిన కొడుకు అభివృద్ధిని చూసి ఎంత సంతృప్తితో సంబరపడ్డాడు. అంతకు రెట్టింపు దుఃఖభారంతో వేగిపోతున్నా డిప్పుడు.

"నో! అలా జరగడానికి వీల్లేదు. కిశోర్ మృత్యువును కూడా జయించి మరీవస్తాడు."

వినాయకరావు కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. నిండుచూలాలైన కోడలు పుట్టింటికి వెళ్ళింది. ఆమెకీ విషయం తెలిస్తే భరించగలదా?

వినాయకరావు ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి.కిశోర్‌ని తను ఎంత గారాబంగా ఎంత అల్లారుముద్దుగా పెంచేడు! వాడిపై ఎన్ని ఆశలు పెట్టుకుని ఇంత వాణ్ని చేసాడు. కిశోర్‌ని తన ఇష్టానికి అనుగుణంగా తీర్చిదిద్దాడు. తెలివైనవాడు కాకపోయినా జీవితంలో తొక్కేమార్గాన్నిబట్టి-వారి వారి పురోగతి వుంటుందని కిశోర్ ద్వారా తను నిరూపించాడు. ఎన్నో అవరోధాల్ని ఛేదించుకుని ఈనాడు శిఖ రాగ్రం చేరుకోవాలనుకుంటున్నాడు కిశోర్. వినాయకరావు గుండె ఒక్కమారు బాధతో బరువెక్కింది.

"ప్రమాదం జరిగిన తీరు చాలా ఆశ్చర్యంగా వుంది. వంతెన మీంచి మూడొంతుల రైలుబండి వెళ్ళిపోయాక కూలిపోయిందట వంతెన?" అంటున్నారెవరో.

"ఆశ్చర్యమేముంది? అంతా కాలమహిమ! అప్పుడెప్పుడో బ్రిటిష్ వారి కాలంనాటి పెద్దపెద్ద వంతెనలు కూడా ఈ నాటికీ చెక్కు

చెదరకుండా వుంటే నిర్మించి ఇంకా ఏబదేళ్ళు కూడా పూర్తికాని
ఇటువంటి వంతెనలు పేకమేడల్లా కూలిపోతున్నాయంటే కారణం
ఊహించలేరూ?"

"అవునవును అవినీతీ లంచగొండితనం మనుషుల్లో విపరీతంగా
పెరిగిపోయాయి"

"అదేకాదు మేధావులెవ్వరూ ఈ దేశంలో వుండడానికి ఇష్ట
పడడంలేదు. కేవలం తెలివితేటలకి ఇక్కడ విలువ తక్కువని చాలా
మందికి తెల్సిపోయింది. తెలివితేటలతో కాక ఇతర మార్గాలలో వచ్చి
పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళే ఎక్కువ. ఈ పరిస్థితి మారనంత
వరకూ ఇటువంటి ప్రమాదాలు ఇలా నిత్యం జరుగుతూనే వుంటాయి."

"సిమ్మెంటుపాలు తక్కువ వేయించి ఇలా బ్రిడ్జీలూ కట్టడాలూ
నిర్మించకపోతే అటు వాళ్ళెలా బాగుపడి మేడలు మీద మేడలు కట్టు
కుంటారు. ఇటువంటి ప్రమాదాల్లో అమాయకులు ప్రాణాలు పోగొట్టు
కుంటారు. అందరి ప్రాణాల్నీ పొట్టన పెట్టుకుని వాళ్ళు మాత్రం...."

ఇక వాళ్ళ మాటలు వినలేక దూరంగా వచ్చేసి ఓ సిమెంటు
బెంచీమీద కూలబడ్డాడు వినాయకరావు.

ప్లాట్‌ఫారం జనంతో నిండుతూ కిటకిటలాడిపోతోంది.

ఒక ప్రక్క దుఃఖం. మరో ప్రక్క ఆతృత! కొడుకు ఏమై
పోయాడోనన్న బెంగ. వంతెన ప్రమాదం గురించి నలుగురూ అను
కునే మాటలు వింటుంటే అందులో కొన్ని శూలాల్లా గుండెను చీలు
స్తున్నాయి.

వీటన్నిటినుంచి కాస్సేపైనా దూరమౌదామని వినాయకరావు
గతంలోకి దృష్టి మళ్ళించేడు.

ఒక్కగానొక్క కొడుకు భవిష్యత్తుకోసం ఎంత తాపత్రయ
పడ్డాడు తను. కిశోర్ ఎప్పుడూ ఏవరేజ్ స్టూడెంటే. అటువంటి

వాడిప్పుడొక ఇంజనీర్ అయ్యాడంటే దానివెనుక నున్న కృషి ఎంత టిదో ఎవరైనా ఇట్టే ఆలోచించగలరు.

ఎన్ని ప్రైవేట్లు పెట్టించినా ఇంటర్‌మీడియట్‌లో కిశోర్‌కి క్లాసు రాలేదు. అయితే వాడిని ఇంజనీర్ చేయాలని తను కలలుకన్నాడు. ఆ కలల్ని నిజం చేసుకోవడంకోసం తొక్కరాని దార్లు కూడా తొక్క డానికి వెనుకాడలేదు. డబ్బు ఖర్చు పెడితే మార్కులు ఎక్కువ వేయించ వచ్చునని ఎవరో అంటే ఆ విధంగానూ చేసి చూశాడు. అయితే ఆ ప్రయత్నం అంతగా లాభించలేదు.

అయినాసరే ఉన్న రాష్ట్రం లేదు పొమ్మన్నా నిరుత్సాహ పడ కుండా పై రాష్ట్రంలో నలభై వేలు డొనేషన్ కట్టి కిశోర్‌ని ఒకప్రైవేట్ ఇంజనీరింగ్‌కాలేజీలో జాయిన్ చేసాడు.అక్కడినుండి డబ్బు నీళ్ళలా పై రాష్ట్రానికి పారింది. అయితే తాను ఏమంత ఉన్నవాడు కాదు. కానీ పంతం, పట్టుదల వున్నవాడు. అనుకున్నది చేసితీరాలన్న నిశ్చయమైన అభిప్రాయం ఉన్నవాడు. తను సాధించాల్సిన దానికోసం ఏ మార్గమైనా తొక్కగల సత్తాగలవాడు.

అందుకే చేసేది చిన్న ఉద్యోగమే అయినా పాపపుణ్యాలు, దయాదాక్షిణ్యాలూ మరచిపోయి రెండుచేతులా ఆర్జించాడు. లంచాలు తీసుకున్నాడు. అలా సంపాదించిన సంపాదనంతా కొడుకు చదువుకే ఖర్చు చేసాడు. అలా ఏవరేజ్‌స్టూడెంట్ అనుకున్న కిశోర్‌ని డబ్బుతో ఒక ఇంజనీర్ని చేసాడు. లంచమిచ్చే ఉద్యోగం వేయించాడు.

అప్పటికి కిశోర్‌కోసం ఖర్చు చేసింది దాదాపు ఎనభై వేలు. ఆ సొమ్ము రాబట్టుకోవడానికి కొడుక్కి తెలియని చిట్కాలెన్నో చెప్పాడు. సర్వీసులో, వయసులో ఆర్జించకపోతే ఆ తర్వాత ఎవరూ ముఖమన్నా చూడరని హితోపదేశం చేశాడు.

కిశోర్ పెళ్ళి కూడా తను చాలా ఆలోచించి ప్లాండ్‌గానే చేసాడు.

కిశోర్‌తో సహా అందరూ ఇష్టపడ్డ మేనరికపు సంబంధాన్ని నెమ్మదిగా తప్పించేశాడు. లక్షరూపాయలు కట్నం తెచ్చిన హేమనిచ్చి పెళ్ళి చేశాడు.

కిశోర్ కూడా నెమ్మదిగానే తన మార్గంలోనే నడవడం తనలానే ఆలోచించడం నేర్చుకుంటున్నాడేమో ఏ వంకలూ పెట్టకుండానే హేమను చేసుకోవడానికి ఒప్పుకున్నాడు. ఎంత సంతోషం కలిగిందో తనకు.

గొల్లున ఏడుపులు విన్పించడంతో అటు వెళ్ళాడు వినాయకరావు. మరణించినట్టు రూఢి అయిన మరికొందరి పేర్లను బోర్డులో వుంచారు రైల్వేవారు. వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూనే వెళ్ళి చూశాడు వినాయకరావు. అందులో కిశోర్ పేరులేదు. అంత దుఃఖంలోనూ, ఆత్రుతలోనూ. కాస్తంత ఆనందం కలిగింది.

ఎవరో.... ఏభై ఏళ్ళ ముసలమ్మ స్తంభానికి తల బాదుకుంటూ హృదయ విదారకంగా ఏడుస్తోంది.

పెళ్ళయిన రెండేళ్ళకే భర్త మరణిస్తే ఉన్న ఒక్కగానొక్క కూతుర్ని అల్లారుముద్దుగా పెంచుకొచ్చింది. తన రెక్కల కష్టంతో సంపాదించిన సొమ్మంతా ఖర్చుపెట్టి ఏడాది క్రితమే పెళ్ళి చేసింది. వారంరోజుల క్రితమే పుట్టిన మనుమరాల్ని చూసుకుని సంతోషించింది. ఇంతలోనే దేవుడికి కన్నుకుట్టింది. ఈ అవాంతరం ముంచుకొచ్చింది. కూతుర్ని చూడ్డానికొచ్చిన అల్లుడు క్రితంరోజు ప్రమాదం జరిగిన ట్రైన్‌లోనే వెళ్ళాడట. అతని పేరు ఆ లిస్టులో వుంది.

'ముచ్చటయిన సంసారమనుకున్నాను. నా రెక్కల కష్టంమీద దాన్నొక ఇంటిదాన్ని చేసాననుకున్నాను. ఎవరికన్యాయం చేసానని ఏ పాపపు సొమ్ము తిన్నానని నాకీ శిక్ష విధించావు భగవంతుడా" అంటూ ఏడుస్తోంది ముసిల్ది.

వినాయకరావు మనసు వికలమైంది. ఆ ముసిల్దాని ఆక్రందనలో ఆఖరి మాటలు బాణాల్లా దూసుకొచ్చాయి.

తను ఎంత అన్యాయంగా సంపాదించాడు! అమాయక ప్రజల నుండి వందలూ వేలు ఉత్తపుణ్యానికే ఎంతలా పిండేడు. తన అధికారాన్నీ. పదవినీ ఉపయోగించి ప్రజల్ని ఎంతలా దోచుకున్నాడు? వాళ్ళందరి తిట్లు.శాపనార్థాలు గాలికే పోతాయనుకున్నాడు. డబ్బొక్కటే శాశ్వతమనుకున్నాడు. కానీ ఇప్పుడాలోచిస్తే ఆ పాపం తనని వదిలి పెడ్తుందా?

గబగబా అడుగులు ముందుకు వేశాడు వినాయకరావు. ఎంత దూరం వెళ్ళినా ఏవో మాటలు విన్పిస్తూనే వున్నాయి.

"వంతెన కట్టడంలో లోపాలున్నాయనీ, ఏ ప్రతిభాలేని ఇంజనీర్లు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి అవినీతికి పాల్పడ్డారని అదివరకే ప్రభుత్వం దృష్టికి తెచ్చారెవరో. అధికారులంతా అవినీతి పరులే అయినప్పుడు పట్టించుకునేదెవరు? ఇప్పుడు ప్రమాదం జరిగి ఇన్ని అమాయక ప్రాణాలు బలైపోయాక దర్యాప్తు సంఘాన్ని నియమిస్తోంది ప్రభుత్వం. ఆ నివేదిక అందేదెప్పుడు? న్యాయం జరిగేదెప్పుడు? అసలు నన్నడిగితే ఆ అవినీతి అధికారుల్ని పట్టుకుని ప్రజలే నడి రోడ్డున ఉరి తియ్యాలి"

ఆవేశంతో ఊగిపోతూ ఎవరో అంటున్న మాటలు వినాయకరావు చెవినపడ్డాయి. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఉద్యోగంలో చేరిన కొత్తలో కిశోర్ చాలా నీతిగా వ్యవహరించేవాడు. కాని అతనికి అవినీతిమార్గాన నడవమని పురిగొల్పిందతనేకదూ?

అయితే రెండు చేతులా సంపాదించడం మొదలుపెట్టాక కిశోర్ తన చెయ్యిదాటి పోయాడేమోనన్పించకపోలేదు.

డబ్బుతోపాటే దురలవాట్లు కూడా వచ్చాయి. పనెక్కువగావుండి బాగా పొద్దుపోయాక వచ్చినరోజుల్లో అతనిస్థితిలో మార్పు కన్పించేది. ఆ మైకంలో భార్యను పట్టుకుని ఆమె అందవిహీనం గురించి తిట్టేవాడు. ఎన్నివున్నా కిశోర్‌కి తనంటే ఎప్పుడూ గౌరవమే. అందుకే తనేం అనలేక పోయేవాడు.

కానీ ఇప్పుడు జరిగిన ఈ ఘోరానికి కిశోర్ కూడా బాధ్యుడే అని తెలిస్తే ఈప్రజలం తనను ప్రాణాలతో ఇలా వుండనిచ్చేవారా?

ఆ వంతెన నిర్మాణం జరిగేటప్పుడు కిశోర్ అక్కడే వున్నాడు. అక్కడ నియమించిన కొద్దిమంది ఇంజనీర్లలో కిశోర్ ఒకడు. సరిగ్గా అప్పుడే అటు స్వంతానికి ఇల్లు కట్టే పనిని కూడా ప్రారంభించేడు.

అది సంపాదనా? కాదేమో? దాన్ని దోపిడీ అంటారీజనం ఇప్పుడు చెబితే—అలా సంపాదించేడు కిశోర్.

కానీ ఆ కిశోరే ఈనాడు ప్రాణాలతో వున్నాడా అని భయపడాల్సిన సమయం వచ్చింది.

వినాయకరావు మస్తిష్కంలో ఆలోచనలు గజిబిజిగా తిరుగాడుతూ అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అతని మనసులో భయం స్థానంలో పశ్చాత్తాపం నెమ్మదిగా చోటు చేసుకుంటోంది.

ఓ మూలన వున్న సిమ్మెంటు బెంచిమీద కూర్చుని తలను రెండు చేతులమధ్యా పెట్టుకున్నాడు. అతని కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు!

ఒకవేళ కిశోర్‌కి జరక్కూడనిదేమైనా జరిగితే తనేమైపోతాడు? కిశోర్‌కేమైనా జరిగితే అందుకు బాధ్యుడు తనే!

సహజంగా తెలివైనవాడు కాని కిశోర్‌కి డబ్బిచ్చి డిగ్రీ సంపాదించింది తను. డబ్బిచ్చి ఉద్యోగాన్ని కొనుక్కొచ్చింది తను. అక్రమ మార్గంలోనైనా డబ్బుసంపాదించాల్సిందేనని ప్రోత్సహించింది తను.

అయితే తనొక్కడేనా అలా ఈ దేశంలో? కానేకాదు. తనకు మార్గదర్శకులు ఎందరో వున్నారు.

ఎవరో చెప్పినట్లుగా మేధావులూ, దేశాన్ని ఆర్థికంగానూ

సాంఘికంగాను పటిష్టపరిచే విద్యావంతులూ తమ తమ స్వప్రయోజనాలకోసం భవిష్యత్తుకోసం విదేశాలకు వలసపోతే మిగిలివున్న వారిలో చాలామంది వున్నత పదవులను ప్రతిభనుబట్టికాకుండా డబ్బు వెచ్చించో పలుకుబడిని వుపయోగించో మరొకదానిని ఆధారం చేసుకునో అలంకరిస్తున్నారు. కల్తీ సిమ్మెంటుతో నిర్మించిన ఈవంతెనలాగే రేపటితరం భవిష్యత్తుకోసం మరో ప్రపంచపు మార్గంలో నిర్మాణమవ్వాల్సిన కొత్త సమాజపు వంతెన పటిష్టంగా నిలబడగలదా?

కనీసం ఆ భావి వంతెన పునాదులు గట్టిపడడం కోసం ఏదో ఒకటిచేయకతప్పదు.

వినాయకరావులో కలిగే ఈ కొత్త ఆలోచనలు తనకే ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

జ్ఞానం వచ్చిన దగ్గర్నించి డబ్బు సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకున్నాడు. కానీ ఇప్పుడాలోచిస్తే అన్పిస్తోంది - మనిషి జీవించడానికి డబ్బు కావాలిగాని డబ్బు సంపాదించడమే జీవిత లక్ష్యం కాదూ అని.

తెలిసో తెలియకో చేసిన తప్పుకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఈ మారణహోమానికి కారణభూతుడైనందుకు తనకీశిక్ష పడాల్సిందే.

అన్నిటికీ అతీతంగా ఏ విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేంత మానసిక స్థయిరాన్ని పెంపొందించుకున్నాడు వినాయకరావు.

అలజడి మొదలైంది.

క్షతగాత్రులను తీసుకువస్తున్న ప్రత్యేక రైలు కొన్నిక్షణాల్లో వస్తున్నట్టు అనౌన్స్‌మెంట్ విన్పించింది.

జనంలో తోపులాట. బాధితుల కుటుంబాలలో ఆందోళన! పరామర్శకు ముఖ్యమంత్రీ, కలెక్టరూ తదితర మంత్రులూ వస్తున్నారు. వారికోసం భద్రతాదళాలు, పోలీసులూ ఫోటాగ్రాఫర్లు.

జనం ప్రవాహంలా కదుల్తున్నారు. గుబులుతోనిండిన గుండెలూ కన్నీళ్ళింకిన కనులూ.

వారితోపాటే వినాయకరావుకూడా లేచి అటువైపు కదిలాడు. ✱